ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కోదాడ శివారులో బైపాస్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

ఫ్లైఓవర్ కోసం బైపాస్ ఎక్కిన ప్రజలు

- జాతీయ రహదారి దాటుతూ వందల మంది మృతిచెందారని ఆవేదన
- మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి స్పందించి ఫ్లైఓవర్ నిర్మించాలని విజ్ఞప్తి

కోదాడ, మే 30: సూర్యాపేట జిల్లా కోదాడ, కట్టకమ్ముల గూడెం గ్రామాల మధ్య కోదాడ శివారులో బైపాస్ రోడ్డుపై ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ పది గ్రామాల ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. బాబూనగర్ రామాపురం, నరసింహాపురం, కట్టకొమ్ములగూడెం, ఆర్లగూడెం, రామచంద్రనగర్, కొండాపురం, ఉత్తమ్ పద్మావతి కాలనీ తదితర గ్రామాల ప్రజలు శుక్రవారం వందలాదిగా బైపాస్ రోడ్డు పైకి చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ.. 65వ నంబర్ జాతీయ రహదారి మీదుగా నిత్యం వందలాది మంది ప్రజలు ఆయా గ్రామాల నుంచి కోదాడకు విద్యా వైద్యం, ఉపాధి కోసం వచ్చి వెళ్తుతుంటారని, రోడ్డు దాటేటప్పుడు వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనడంతో అనేకమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి ఈ రహదారి దాటి ఇంటికి వచ్చే వరకు గ్యారెంటీ లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చొరవచూపి బైపాస్ రోడ్డుపై ఫ్లైఓవర్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలతో మంత్రి పొన్నం భేటీ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఆర్టీసీలో కార్మిక సంఘాల పునరుద్ధరణ, సమ్మె హామీలపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'ఆర్టీసీలో కార్మిక సంఘాలకు చెక్?' అనే శీర్షికన కథనం ప్రచురితమవగా.. దానికి అటు ప్రభుత్వం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఇటు కార్మిక సంఘాల నేతలు స్పందించారు. శుక్రవారం జరిగిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకున్నది. వీరి చర్చల సారాంశాన్ని ప్రభుత్వ పెద్దలు, కార్మిక సంఘాల నేతలెవరూ అధికారికంగా వెల్లడించనప్పటికీ.. మంత్రిని కలిసిన కార్మిక సంఘాల నేతల వినతికి పొన్నం సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నీ తమ పరిశీలనలో ఉన్నాయని, వాటిపై ముఖ్యమంత్రితో మాట్లాడి చర్చిస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఆర్టీసీలో యూనియన్లను రద్దు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదనే సంకేతం మంత్రి ద్వారా వచ్చినట్టు తెలిసింది. జూన్ 2న ప్రభుత్వ ఉద్యోగులతోపాటు.. ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త అందుతుందని ఆశిస్తున్నారు.

రాష్ట్రావతరణ వేడుకల్లో జెండావిష్కరించేది వీరే...

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా జిల్లాల్లో జాతీయ జెండా ఆవిష్కరించే వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఏ జిల్లాల్లో ఎవరు జెండా ఆవిష్కరించనున్నారో వారి వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వికారాబాద్‌లో స్పీకర్ గడ్డంప్రసాద్‌కుమార్ రాష్ట్రావతరణ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క – ఖమ్మం, మంత్రుల్లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి – వరంగల్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి – సూర్యాపేట, పొన్నం ప్రభాకర్ –సిద్దిపేట, దామోదర రాజనర్సింహ –సంగారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి – నల్లగొండ, ధనసరి అనసూయ సీతక్క –ములుగు, జూపల్లి కృష్ణారావు –మహబూబ్‌నగర్, శ్రీధర్‌బాబు – కరీంనగర్, కొండా సురేఖ– హనుమకొండ, తుమ్మల నాగేశ్వర్‌రావు – భద్రాద్రికొత్తగూడెంలో జాతీయజెండాలను ఆవిష్కరిస్తారు. ఇతర జిల్లాల్లో ప్రభుత్వ విప్‌లు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు జాతీయ జెండాలను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం వెల్లడించింది.

జీపీవో ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): గ్రామ పాలనాధికారుల (జీపీవో) ఎంపికకు ఈనెల 25న పరీక్షలు నిర్వహించగా, వాటి ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో 3550మంది ఎంపికైనట్టు వెల్లడించింది. ఈ మేరకు ర్యాంకులవారీగా ఎంపికైన వారి వివరాలను భూపరిపాలన ప్రధాన కమిషనర్ వెల్లడించారు. మొత్తం 4588మంది పరీక్షలు రాయగా, వీరిలో 3550మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా నుంచి అత్యధికంగా 272, నిజామాబాద్ నుంచి 231మంది, హైదరాబాద్ నుంచి 33మంది ఎంపికైనట్టు తెలిపారు. అలాగే వరంగల్ నుంచి 170మంది, కరీంనగర్ నుంచి 163మంది క్వాలిఫై అయినట్టు వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గ్రామపరిపాలన అధికారుల (జీపీవో) ఫలితాలు ప్రకటించడంపై తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని సంఘం ప్రతినిధులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్ అంటే ఫారెస్టే కాదు.. ఫ్యూచర్ : మంత్రి సీతక్క

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): ఎఫ్ అంటే ఫారెస్టే మాత్రమే కాదని, ఆదివాసీల ఫ్యూచర్ కూడా అని మంత్రి సీతక్క చెప్పారు. హైదరాబాద్‌లోని తాజ్‌డెక్కన్‌లో 'పీఎం జన్మన్', 'ధర్తి ఆబ జనజాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్'పై సౌత్ ఈస్ట్ రాష్ట్రాల వర్క్‌షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) నిర్వహించిన యంగ్ లైవ్స్ రౌండ్–7 సర్వే నివేదికను మంత్రి సీతక్క విడుదల చేశారు.

ఏ చట్టం కింద నోటీసులు ఇస్తున్నారో చెప్పాలి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ అధికారులు జారీచేసే నోటీసులను ఏ చట్టం కింద ఇస్తున్నారో చెప్పాలని హైకోర్టు స్పష్టం చేసింది. చట్టం గురించి ప్రస్తావించినపుడే నోటీసు ఇచ్చే అధికారం ఆ అధికారికి ఉన్నదో లేదో తేలుతుందని పేర్కొన్నది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం తోళ్ల కార్ఖానా (పాత సర్వే నంబర్ 380)లోని 5.30 ఎకరాలకు సంబంధించిన వివాదంపై 2019 జూన్‌లో తహసీల్దార్ జారీచేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ బుజ్జి బానోత్ మరో 39 మంది హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల ఈ తీర్పు వెలువరించారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని బలవన్మరణం

- నా చావుకు కాంగ్రెస్ నాయకులే ముఖ్య కారణం
- చేతిపై రాసుకుని ఉరేసుకున్న అశోక్
- మృతదేహంతో పంచాయతీ ఆఫీస్ వద్ద బంధువుల ఆందోళన
- ధర్నాకు మద్దతు పలికిన బీఆర్ఎస్, సీపీఎం నాయకులు .. కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

చింతపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, నాయకులు

యాచారం, మే 30: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన దొడ్డి అశోక్ (44)కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇందిరమ్మ ఇల్లు కోసం ఆ కుటుంబం దరఖాస్తు చేసుకున్నది. ఆ కుటుంబానికి సొంతిల్లు లేకపోవడంతో మొదట్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో ఆ కుటుంబం పేరు వచ్చింది. చివర ప్రకటించిన జాబితాలో అతని పేరు రాలేదు. తొలి విడత ఎంపికైన లబ్ధిదారులు ముగ్గ పోసుకొని ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టారు. అది చూసిన అశోక్ లిస్టు కోసం వెతికాడు. దానిలో తన పేరు లేకపోవడంతో తనకు ఇందిరమ్మ ఇల్లు రాదని మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 'ఇందిరమ్మ ఇల్లు గురించి నా చావుకు కారణం కాంగ్రెస్ నాయకులే' అంటూ తన చేతిపై సూసైడ్ నోట్ రాసుకొని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణలు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని గంపెడాశతో ఉన్న అశోక్ జాబితాలో పేరు లేకపోవడంతో తనకు ఇల్లు రాదని మనస్తాపానికి గురైనట్టు స్థానికులు తెలిపారు. గ్రామంలో వార్డు మాజీ సభ్యుడిగా కొనసాగిన అశోక్ సొంతింటికి నోచకపోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు.

మంజూరైన ఇంటిని రద్దు చేయించారు

కాంగ్రెస్ నాయకుల వల్లే తన భర్త ఉరేసుకొని చనిపోయాడని అశోక్ భార్య బోరున విలపిస్తూ చెప్పింది. కాంగ్రెస్ నాయకులే ఇందిరమ్మ ఇండ్ల జాబితా నుంచి తమ పేరు తొలగించారని ఆరోపించింది. ఇల్లు మంజూరైందనే ఆశతో ఇంటి స్థలం చూసుకునే లోపే మంజూరైన ఇంటిని రద్దు చేయించారని ఆవేదన వ్యక్తంచేసింది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని, ఉన్న ముగ్గురు ఆడపిల్లలను ఎలా పోషించాలని కన్నీరు మున్నీరుగా విలపించింది. మృతదేహం వద్ద ముగ్గురు ఆడపిల్లలతో భార్య రోదిస్తుంటే అక్కడున్న ప్రతి ఒక్కరూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట బాధితుని బంధువుల ఆందోళన

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న అశోక్ మృతదేహంతో అతని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు, చింతపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, పీఏఈసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి అలంపల్లి నరసింహ నేతృత్వంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వారికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. అశోక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో శైలజ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌రెడ్డి అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. అశోక్ కుటుంబానికి 120గజాల ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అశోక్ భార్యకు వితంతు పింఛన్ అందించేందుకు కృషి చేస్తామని, అతని కూతుళ్ల చదువుకు ప్రభుత్వ సహకారం అందిస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఇల్లు రాలేదని ఆత్మహత్యలకు సిద్ధపడుతున్న పేదలు

పేదలు ఇల్లు దక్కకపోవడంతో ఆత్మహత్యలకు సిద్ధపడుతున్నారని సీపీఎం నేత జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇందిరమ్మ ఇల్లు రాలేదన్న మనస్తాపంతో యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన దొడ్డి అశోక్ ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని అన్నారు.

5 లక్షల్లో ఇందిరమ్మ ఇల్లు సాధ్యంకాదు

- అందుకే ఉచితంగా పంపిణీ
- లబ్ధిదారులు డ్వాక్రా గ్రూపులు, బ్యాంకుల్లో లక్ష అప్పు తీసుకోవచ్చు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

మరిపెడ, మే 30: ఇందిరమ్మ ఇంటి నిర్మాణం రూ.5 లక్షలతో సాధ్యం కాదని, అందుకే ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తున్నదని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి కల్యాణలక్ష్మి, కాటమయ్య కిట్లు, పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు డ్వాక్రా గ్రూపుల వద్ద రూ.లక్ష వరకు అప్పు తీసుకోవడానికి అనుమతి ఇస్తున్నామని, లేదా ఇంటిపత్రాలు సరిగ్గా ఉంటే బ్యాంకుల వద్ద కూడా ఇంటి నిర్మాణానికి అప్పు తీసుకోవచ్చని సూచించారు. అయితే లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఉంటేనే బ్యాంకులు అప్పు ఇచ్చేందుకు ముందుకు వస్తాయని తెలిపారు. కాగా ఎమ్మెల్యే సమయపాలన పాటించక పోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు వస్తారని సమాచారమివ్వడంతో లబ్ధిదారులు సమయానికి చేరుకున్నారు. కానీ, ఎమ్మెల్యే మాత్రం మధ్యాహ్నం 2.30 గంటలకు రావడంతో పెదవి విరిచారు.

ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకేనా?

ఫిలింసిటీలో పట్టాలు పొందినవారికి పొజిషన్ చూపించాలి : జాన్‌వెస్లీ

రంగారెడ్డి, మే 30 (నమస్తే తెలంగాణ) : పేదలకు ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ కార్యకర్తలకే కేటాయిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. రామోజీ ఫిలింసిటీలో పట్టాలు పొందిన పేదలందరికీ ఇండ్ల స్థలాలు చూపించాలని, ఫార్మాసిటీ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు కావడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే కేటాయిస్తున్నారని, ఎంతోమంది పేదలు సొంతింటికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు గత ప్రభుత్వం ఎకరాకు గుంట చొప్పున ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చిందని, వాటికి కాంగ్రెస్ సర్కార్ పొజిషన్ చూపించకపోవడం దారుణమని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

రాహుల్ తో రేవంత్‌కు

అర్ధరాత్రైనా యాక్సెస్

- కొన్నిసార్లు కలువకపోవచ్చు కూడా
- ఇద్దరికి గ్యాప్ ఉందనడం అబద్ధం
- ఈడీ రైడ్స్ నా ఇంటిపైన జరుగలేదు
- నా కూతురు నివాసంలో జరిగాయి
- కాంగ్రెస్ సముద్రం.. నేను నీటిబొట్టు
- ఎంపీ రఘునందన్ అసైన్డ్ భూమి ఆక్రమించుకున్నట్టు తేలితే చర్యలు
- 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అర్ధరాత్రి కూడా యాక్సెస్ ఉన్నదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రాహుల్‌కు రేవంత్‌రెడ్డికి మధ్య గ్యాప్ ఉన్నదనడం అబద్ధమని పేర్కొన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. మూడు రోజులు ఢిల్లీలో ఉన్నా రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంపై మీడియా ప్రతినిధులు అడుగగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ మధ్య ఎలాంటి గ్యాప్ లేదని, అర్ధరాత్రి కూడా కలిసే యాక్సెస్ రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ చీఫ్‌కు ఉన్నదని తెలిపారు. అనేకసార్లు కలుస్తారని, మరికొన్ని సార్లు కలువకపోవచ్చని అన్నారు. అప్పట్లో పార్టీలో నంబర్ –2ను అని చెప్పారు కదా అని గుర్తుచేయగా, కాంగ్రెస్ పార్టీ మహాసముద్రమని, అందులో తాను కేవలం నీటి బిందువునని పేర్కొన్నారు. తాను పార్టీకి ఏదైనా చెప్తే పరిగణనలోకి తీసుకుంటుందని అనుకోవడం లేదని అన్నారు. తన ఇంటిపై జరిగిన ఈడీ దాడుల గురించి ప్రశ్నించగా.. 'నా పైన, నా ఇంటిపైన ఈడీ రైడ్ జరగలేదు. నా కూతురు ఉంటున్న నివాసంలో ఈడీ రైడ్స్ జరిగాయి. అయినా నాకు సంబంధం లేదని నేను అనను.. కట్టలకట్టల డబ్బులు దొరికాయి నా ఇంట్లో.. అని కేటీఆర్ మాట్లాడటం బంద్ చేయాలి' అని చెప్పారు.

అసైన్డ్ భూములపై చర్యలు తీసుకుంటాం

అసైన్డ్ భూములను ఎవరైనా ఆక్రమించినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అనేక చోట్ల అసైన్డ్ భూములు బడాబాబుల పేర, రాజకీయ పెద్దలు, కంపెనీల పేరుతో ఉన్నాయని, ఆడిట్‌లో ఆక్రమించుకున్నట్టు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అసైన్డ్ భూముల ఆక్రమణపై మీడియా ప్రశ్నించగా.. ఆడిట్‌లో ఆక్రమించినట్టు తేలితే చర్యలుంటాయని చెప్పారు. అసైన్డ్ భూములు అర్హులైన నిరుపేదల పేరుతో ఉంటే విచారణ జరిపి సాగు చేసేందుకు వారికే అప్పగిస్తామని పేర్కొన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ సిస్టమ్‌తోపాటు ఆధార్ అనుసంధాన రిజిస్ట్రేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 413 గ్రామాల్లో నక్షలు లేవని, వీటిలోని ఐదు గ్రామాల్లో నక్షల రూపకల్పన కోసం ఏరియల్ సర్వేతోపాటు భౌతిక సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు.

రాజన్న కోడెల మృత్యుఘోష

- అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న మూగ జీవాలు..!
- నిత్యం పదుల సంఖ్యలో మృత్యువాతపడుతున్న కోడెలు
- షెడ్డు సామర్థ్యానికి మించి కోడెలు
- మేత లేకపోవడమూ కారణమే
- తాజాగా ఎనిమిది కోడెల మృత్యువాత
- గుట్టుచప్పుడు కాకుండా ఖననం

మృతిచెందిన కోడెలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

వేములవాడ, మే 30: రాజన్న ఆలయ గోశాలలో మరణమృదంగం వినిపిస్తున్నది. అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వ పట్టింపులేమితో మూగ జీవాలకు శాపంగా మారింది. సరైన ఆవాసం, ఆహారం లేక తల్లడిల్లుతూ తనువుచాలిస్తున్నాయి. షెడ్డు సామర్థ్యానికి మించి కోడెలను కట్టేయడంతో తరచూ తొక్కిసలాట జరుగుతుండటం, మరోవైపు సరిపడా మేత, దాణా అందించకపోవడంతో బక్కచిక్కి నిత్యం పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. తాజాగా శుక్రవారం 8 జీవాలు మృత్యువాతపడగా, గుట్టుచప్పుడు కాకుండా మూలవాగులో ఖననం చేయడంపై భక్తుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఘటనపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి.. పూర్తి వివరాలు అందజేయాలని, తక్షణమే వైద్య సేవలు అందించాలని ఆదేశించడంతో పశువైద్యాధికారుల బృందం రంగంలోకి దిగి, విచారణ చేపట్టింది. జీవాల మృతికి కారణాలను విశ్లేషించడంతోపాటు అనారోగ్యంగా ఉన్నవాటికి వైద్యం చేస్తున్నది.

పరిమితికి మించి కోడెలు.. అంతంతే మేత

రాజన్న భక్తులు కోరిన కోర్కెలు తీరితే స్వామివారికి నిజ కోడెను సమర్పించుకుంటామని మొక్కుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు కోడెలను తీసుకువచ్చి రాజన్న ఆలయానికి అప్పగిస్తుండగా, వాటిని అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించిన కోడెలను అవసరమైన రైతులకు కొన్నేండ్లుగా అందజేస్తూ వస్తున్నారు. ఆరు నెలల క్రితం కోడెల పంపిణీలో అవకతవకలు జరగడం, ఒకే వ్యక్తికి 60 జీవాలు అందించడం వివాదాస్పదం కావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ క్రమంలో గోశాలకు భక్తులు సమర్పించే కోడెల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండగా, గోశాల ఇరుగ్గా మారిపోయింది. ఇక్కడ 400 నుంచి 500 కోడెలను సంరక్షించే స్థలం, అందుకు తగ్గట్టుగానే వసతులు ఉండగా, ప్రస్తుతం 1,250కి పైగా కోడెలు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. పరిమితికి మించి రాజన్న కోడలు సంరక్షిస్తుండటంతో తరచూ తొక్కిసలాటలు జరుగుతున్నాయి. ఇటీవల వర్షాలతో గోశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు, మోతాదుకు తగ్గట్టుగా పశుగ్రాసం అందకపోవడంతో నీరసించి మృతిచెందుతున్నట్టు వైద్యాధికారులు గుర్తించారు. నిత్యం 400 కోడెలకు మాత్రమే పచ్చి గడ్డిని అందిస్తున్నట్టు తెలుస్తుండగా, అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోశాలలో రోజూ పదుల సంఖ్యలో కోడెలు మృతి చెందుతున్నాయని ఆరోపిస్తున్నారు.

రైతులకు పంపిణీ చేస్తాం

రాజన్న ఆలయ కోడెలను నిజమైన, అవసరమైన రైతులకే నేరుగా అందించేందుకు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయానికి నివేదించి, సంప్రదింపులు చేస్తున్నాం. జియో ట్యాగింగ్ చేసి పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీటిపై అధ్యయనం జరుగుతున్నది. త్వరలోనే పంపిణీ మొదలుపెడతాం.

– బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈవో రాజన్న ఆలయం

'డీజీపీ' కోసం పోటాపోటీ

- తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఇద్దరు ఐపీఎస్‌లు
- ఒకరు ఢిల్లీలో.. మరొకరు రాష్ట్రస్థాయిలో యత్నాలు
- ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం కావడంతో తాత్సారం
- ఆ ఇద్దరితోపాటు తెరపైకి మహిళా అధికారి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు తదుపరి పోలీస్ బాస్ (డీజీపీ) ఎవరు? ఇప్పుడు ఈ ప్రశ్న పోలీస్ శాఖను, రాజకీయ నేతలను తొలిచేస్తున్నది. పోలీస్ శాఖలో అత్యున్నతమైన ఈ పోస్టు కోసం ఆ శాఖలో ఇద్దరు అధికారుల మధ్య కనిపించని యుద్ధం జరుగుతున్నది. ఎంతో సమర్థులైన ఆ ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతున్నట్టు తెలిసింది. దీంతో వారిద్దరూ ఎవరిస్థాయిలో వారు పైరవీలు సాగిస్తున్నట్టు సమాచారం. అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోకుండా ఒకరు ఢిల్లీ స్థాయిలో, మరొకరు రాష్ట్ర స్థాయిలో పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నిస్తున్నారు. వీరిలో ఒకరికి సీనియర్ ఐపీఎస్‌గా, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పేరున్నప్పటికీ డీజీపీ పదవి దక్కేలా మేనేజ్ చేసుకునే రాజకీయ వ్యవస్థ లేదు. అదే పోస్టును ఎప్పట్నుంచో ఆశిస్తున్న మరో సీనియర్ ఐపీఎస్‌కు ప్రభుత్వ పెద్దలతో మంచి సంబంధాలున్నప్పటికీ ఇటీవల ఆయన పనితీరు కొంత ఇబ్బందికరంగా మారడంతోపాటు భూదాన్ పోచంపల్లి భూముల వ్యవహారం ఆయన మెడకు చుట్టుకున్నది. దీంతో ఎలాగోలా ఆ కేసును క్లియర్ చేసుకునే పనిలో ఆ అధికారి నిమగ్నమయ్యారు. రెండుసార్లు త్రుటిలో చేజారిన పోలీస్ బాస్ పదవిని ఈ సారి ఎలాగైనా దక్కించుకోవాలనే కసితో ఇంకో సీనియర్ అధికారి ఢిల్లీస్థాయిలో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మళ్లీ జూనియర్‌కే పగ్గాలా?

ఈసారి కూడా తనకంటే మూడేండ